క్లుప్తంగా

చెత్త కుప్పలతో అవస్థలు



కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డుపై చెత్తకుప్పలు

నరసాపురం: పట్టణంలో ప్రధాన ప్రాతమైన మార్కెట్ ఏరియాలో పారిశుద్ధ్య నిర్వహణ రోజురోజుకూ అధ్వానంగా తయారవుతుంది. ఎటు చూసినా రోడ్లపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త సేకరణలో మున్సిపల్ శానిటేషన్ అధికారులు చూపిస్తున్న నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు వస్తున్నాయి. అల్లూరి కాంప్లెక్స్ వెనుక వైపు చేపలమార్కెట్, కూరగాయల మార్కెట్, కిరణా మార్కెట్‌లు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఏ రోడ్డుపై చూసినా ఆదివారం చెత్తకుప్పలే దర్శనమిచ్చాయి. ప్రతిరోజూ ఈ ప్రాంతానికి వేలాది సంఖ్యలో జనం మార్కెట్ పని మీద వస్తుంటారు. రోడ్డుపై చెత్త కుప్పలు ఆ చెత్తకుప్పల వద్దకు ఆవులు, కుక్కలు, పందులు చేరి చిందరవందర చేస్తుండడంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారయ్యింది. మున్సిపల్ అధికారులు స్పందించి పరిస్థితి చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

నరసాపురం రైల్వేస్టేషన్ పరిశీలన



రైల్వేస్టేషన్‌ను సందర్శించిన బీజేపీ నాయకులు

నరసాపురం: బీజేపీ నాయకులు ఆదివారం నరసాపురం రైల్వేస్టేషన్ సందర్శించి స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. డీఆర్‌యూసీసీ సభ్యుడు ఎన్ పెద్దిరాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు స్టేషన్‌లోని పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరసాపురం రైల్వే అభివృద్ధికి చర్యలు చేపడుతుందని అన్నారు. కోటిపల్లి–నరసాపురం రైల్వేలైన్ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. నరసాపురం–మచిలీపట్టణం రైల్వేలైన్ నిర్మాణానికి సర్వే పూర్తయ్యిందని చెప్పారు. బీజేపీ నాయకులు పులపర్తి వెంకటేశ్వరరావు, మునుకోటి వెంకటేశ్వరరావు, రావూరి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా గోపాలస్వామి, మాధవస్వామి కల్యాణం



సిద్ధాంతంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతంలో శ్రీ విజయ గోపాల స్వామి, జగన్మాతలు రుక్మిణిసత్యభామలకు, శ్రీ మాధవ స్వామి, జగన్మాతలు శ్రీదేవి–భూదేవిలవార్ల కళ్యాణం ఆదివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవల్లి లక్ష్మీనరసింహచార్యులు, ఖండవల్లి భాస్కరశోభనాద్రాచార్యులు ఆధ్వర్యంలో కసుకుర్తి వెంకటేశ్వర్లు, మానస దంపతులు కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్లకు విశేష అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు, ధ్వజారోహణ, అంకురార్పణ, బలిహరణలు నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ముత్యాల సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న అమ్మఫౌండేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని గుర్తుతెలియని ఓ మృతదేహానికి ఆదివారం స్థానిక అమ్మ చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు చేశారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వేస్టేషన్ సమీపంలో బి.శ్రీను అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అతనికి సొంత వాళ్లు ఎవ్వరూ లేకపోవడంతో పోస్టుమార్టం అనంతరం విషయం తమ ఫౌండేషన్ సభ్యులకు తెలియపరిచారు. విషయం తెలుసుకుని అమ్మ చారిటబుల్ ఫౌండేషన్ తరుపున పట్టణ రుద్రభూమిలో అంత్యక్రియలు నిర్వహించినట్లు ఫౌండేషన్ సభ్యులు అనంతపల్లి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, కట్ట సాయికిరణ్, షేక్ సిద్దిక్, సుదీర్, అంబటి సాయితేజ, శానిటరీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కాలనీలో సమస్యల తిష్ట

- డ్రెయిన్లు లేక ఇబ్బందులు
- పట్టించు కోని అధికారులు



కాలనీలో రోడ్డుపై చెత్తకుప్పలు పేరుకుపోయిన దృశ్యం



ఇళ్ల మధ్య అధ్వానంగా ఉన్న డ్రెయిన్

నరసాపురం: పట్టణంలోని 22వ వార్డు కొత్త కాలనీలో మౌలిక వసతులు లేక స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పేదలు నివసించే ఈ కాలనీ అభివృద్ధి విషయంలో అటు ప్రజాప్రతినిధులు ఇటు అధికారులు ఏమాత్రం శ్రద్ధ పెట్టక పోవడం గమనార్హం. ముఖ్యంగా కాలనీలో డ్రెయిన్ల సదుపాయం లేదు. 35 ఏళ్ల క్రితం పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన పేదలు సుమారు 200 కుటుంబాల వారికి ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. అప్పట్లో పట్టణంలో కొత్తగా ఓ కాలనీ ఏర్పడినట్టయ్యింది. దీంతో ఈ ప్రాంతానికి కొత్త కాలనీగా పేరొచ్చింది. కాలనీ ఏర్పడి మూడున్నర దశాబ్దాలు కావస్తున్నా ఈ కొత్త కాలనీలో ఏళ్లుగా సమస్యలకు మోక్షం లేకుండా అలాగే పేరుకుపోయాయి. కాలనీలో మొత్తం రిక్షా డ్రైవర్లు, రోజువారీ కూలి పనులు చేసుకునే కార్మికులు నివసిస్తారు. పేదలు నివసించే కాలనీ కాబట్టే ఈ ప్రాంత అభివృద్ధి విషయంలో ఎవరూ దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి.

డ్రెయిన్లు లేవు...రోడ్లు నిర్మించరు

కాలనీలో డ్రెయినేజీ సౌకర్యం లేదు. దీంతో వాడకపు నీరంతా రోడ్ల మీదకే వదిలేయాల్సిన పరిస్థితి. ఇక వర్షం వస్తే రెండు, మూడు రోజుల పాటు ముంపులోనే కాలనీ ఉంటుంది. కొన్ని ఇల్ల వారు వాడకపునీరు పారేదారి లేక ఇంటికెదురుగా గోతులు తీసుకుంటున్నారు. రోజూ ఆ గోతిలోని మురుగునీరు తోడుకుని వేరే చోటుకు తీసుకెళ్లి పారబోస్తుంది. కాలనీ అంతా పక్కా రోడ్ల నిర్మాణం జరగలేదు. కాలనీలో చాలా ప్రాంతాల్లో మట్టి రోడ్లే దిక్కు. కాలనీలో పూర్తిస్థాయిలో రోడ్లు నిర్మించాలనే డిమాండ్ కూడా చాలా కాలంగా పెండింగ్‌లోనే ఉంది. ఇక మంచినీటి కుళాయిల మెయిన్ పైప్‌లైన్‌లు ఈ ప్రాంతానికి విస్తరించలేదు. దీంతో కుళాయిల ద్వారా నీరు సవ్యంగా రావడం లేదు. కాలనీలో సగానికి పైగా కుటుంబాల వారికి వ్యక్తిగత మరుగుదొడ్లు లేవు. పారిశుద్ధ్యం కూడా అధ్వానంగా వుండటంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులతో పాటు నాయకులు స్పందించి కొత్త కాలనీలో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రెయిన్లు నిర్మించాలి



కాలనీలో డ్రెయిన్లు లేవు. మురుగునీరు ఇళ్ల మధ్యే ఉండిపోతుంది. దీంతో ప్రజలు రోగాలు పాలవుతున్నారు. దోమల బెడద కూడా విపరీతంగా ఉంది. డ్రెయిన్లు కట్టి, పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపరచాలి.

– ముచ్చర్ల త్రిమూర్తులు, సీపీఎం పట్టణ కార్యదర్శి

పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు



పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుదలకు ఇటీవల పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాము. అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నాము. కొత్త కాలనీలో సమస్యలపై దృష్టిపెడతాము. రోడ్లపై చెత్తలేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. డ్రెయిన్లను శుభ్రం చేసే పనులు వార్డుల వారీగా జరుగుతున్నాయి.

– ఎం.అంజయ్య, మున్సిపల్ కమిషనర్

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఎక్సైజ్ అధికారులు పాలకొల్లు మండలంలో ఆదివారం తనిఖీలు చేయగా శివదేవుని చిక్కాల గ్రామంలో ఓ వ్యక్తి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో బి.ప్రసాద్ అనే వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడని అతని నుంచి ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్ట్ షాపులు ఎవరు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముఖదారమ్మ ఉత్సవాల వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రా విచెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖదారమ్మ వారి జాతర మహోత్సవాల వాల్‌పోస్టర్లను ఆదివారం కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల లక్ష్మణ గోవింద్ మాట్లాడుతూ ఈ నెల 30 ఉగాది రోజున అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ 7 వరకూ తొమ్మిది రోజులు పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెక్కా కృష్ణ, వెలిగట్ల గణేష్, చినిమిల్లి బాబి, కొల్లంశెట్టి చిన్ని, బెల్లంకొండ నరసింహారావు, దైవాల సతీష్ తదితరులు పాల్గొన్నారు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

నరసాపురం: పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పన వంటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం నరసాపురం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించిన సభలో గోపాలన్ మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికలు సమయంలో పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున కేటాయిస్తామని చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇంత వరకూ ఈ అంశంలో దృష్టి పెట్టట్లేదన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించుకోవడానికి ఇస్తామన్న రూ 5 లక్షలు ఆర్థిక సాయం అందించాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను లే–అవుట్‌చేసి సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముచ్చర్ల త్రిమూర్తులు, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, గొర్ల రామకృష్ణ, మంచిలి నీలకంఠం, నోముల కొండ తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ



డీఎన్నార్ కళాశాలలో భూమి పూజ చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు శ్రీనివాసవర్మ, రామానాయుడు

పాలకొల్లు సెంట్రల్: పేదరికం నిర్మూలనకు, అభివృద్ధికి విద్య ఒక్కటే రాజ్యమార్గమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం స్థానిక దాసరి నారాయణరావు (డీఎన్నార్) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆయన రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ గోపీమూర్తిలతో కలిసి రూ. 1.40 కోట్లతో అదనపు తరగతి గదులు, మౌళిక వసతుల కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసవర్మ మాట్లాడుతూ కేంద్రం నుండి వచ్చే నిధులు ప్రతీ రూపాయి రాష్ట్ర అభివృద్ధికి ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.శోభారాణి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, జివి, పెచ్చెట్టి బాబు, గౌరునాయుడు, రావూరి సుధ, బోణం నర్సయ్య, పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్ అందజేత

రెండు దశాబ్ధాలుగా ధర్మారావు ఫౌండేషన్ పేరుతో మంత్రి రామానాయుడు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. గత 36 రోజులుగా డిఎస్సీ శిక్షణ పొందుతున్న 700 మంది అభ్యర్థులకు రూ. 8 లక్షలతో స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ధర్మారావు ఫౌండేషన్‌కు రూ. 5 లక్షలు విరాళాన్ని అందజేస్తానని ప్రకటించారు.

యువతిని కాపాడిన యువకులకు సత్కారం



చించినాడలో మత్స్యకార యువకులను సన్మానిస్తున్న సర్పంచ్ దంగేటి రాజమణి

యలమంచిలి: ఇటీవల ఒక యువతి ప్రేమ విఫలం కావడంతో చించినాడ వద్ద వశిష్ట గోదావరి నది వంతెన మీద నుంచి గోదావరిలో దూకింది. ఆ సమయంలో తమ పడవపై చేపల వేటకు వెళ్లిన మత్స్యకార యువకులు చుక్కా శ్రీను, చుక్కా లోకేష్ (ఇద్దరూ అన్నదమ్ములు) వెంటనే ఆ అమ్మాయిని కాపాడారు. దీంతో ఆ యువకులను ఆదివారం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ దంగేటి రాజమణి శాలువా, పూలమాలతో సన్మానించారు. యువతి కుటుంబ సభ్యులు యువకులకు నూతన వస్త్రాలు, సెల్‌ఫోన్ బహూకరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సై కర్ణీడి గుర్రయ్య ఇద్దరు యువకులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు నల్లి సంధ్యారాణి, గ్రామ ఉప సర్పంచ్ రుద్రరాజు చిన్న, రిటైర్డ్ ఎంఈఓ ముదునూరి రంగరాజు, మాజీ ఎంపీటీసీ విప్పర్తి సాయిబాబు, పంచాయతీ కార్యదర్శి మాదాసు హరిప్రసాద్, వార్డు సభ్యులు కఠారి నారాయణస్వామి, నల్లి నరేష్, వడ్డి రారాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా కొన్ని వారాలుగా కార్యక్రమం నిర్వహించడం లేదని, 10 నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.

వైభవంగా జైన మందిరం ప్రతిష్టాపనోత్సవాలు



ఆచంట జైన మందిర ప్రతిష్ఠకు తరలివస్తున్న జైన గురువులు



ఆచంటలో జైన మందిర ప్రతిష్టాపనోత్సవం చేస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆచంటలో రాజేంద్ర సూరీజీ గురుధ్యాన జైన మందిర ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. జైనులతో ఆచంట కిక్కిరిసిపోయింది. జైన గురువులు పూజలు, ప్రతిష్ఠ హోమాలు, శిఖర ప్రతిష్ఠ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆచంటలో ఓ విభిన్న వాతావరణం నెలకొంది. జైనులను తిలకించడానికి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో జైన గురువులతో పాటు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జైన ట్రస్టు కమిటీ ఛైర్మన్ అజిత్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన జైన విగ్రహాన్ని అందించిన దేవస్థానం

ఆచంట మదన గోపాల స్వామి ఆలయం వద్ద ఉన్న జైనుల 23వ తీర్థంకుడు చతుర్ముక్ పాశ్వనాథ విగ్రహాన్ని దేవస్థానం అధికారులు జైనులకు అందించారు. విగ్రహాన్ని జైనులకు అందించడంతో గత కొంత కాలంగా వివాదం నడిచింది. గ్రామంలో కొందరు అభ్యంతరాలు పెట్టడంతో పాటు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో కొంత కాలం విగ్రహం అప్పగింత నిలిచిపోయింది. ఇటీవల జైనులు విగ్రహం అందించాలంటూ మరోసారి ముందుకు వెళ్లడంతో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి విగ్రహాన్ని ఇవ్వడానికి అంగీకరించారు. దీంతో ఆదివారం జిల్లా దేవస్థానం అధికారి ఈవీ సుబ్బారావు, దేవస్థానం ఏఈ ఎస్‌కే సైదా, స్థానిక ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ రెవెన్యూ అధికారితో కలిసి అంగీకార పత్రాలు తీసుకుని ట్రస్ట్ అధ్యక్షుడు అజిత్‌కుమార్‌కు విగ్రహాన్ని అప్పగించారు.త్వరలో మార్టేరు రోడ్డులో జైన మందిర నిర్మాణం నిర్మించనున్నారు. పెనుమంట్ర ఎస్సై కె.స్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా నీలకంఠేశ్వరస్వామి, చౌడేశ్వరిదేవి విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహాల ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కొత్తపేటలో ఉన్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీ నీలకంఠేశ్వరస్వామి, చౌడేశ్వరిదేవిల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, కళ్యాణం, పూజా కార్యక్రమాలు అనంతరం మహిళలకు కలశం, పసుపు, కుంకుమ, గాజులు, ఇత్తడి కుంకుమ భరణి, సారె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొని పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు అనంతరం అఖండ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వట్టం గణేష్, మానెం బసవరాజు, బాసిన గునేశ్వరరావు, బాసిన సత్యనారాయణ పాల్గొన్నారు.

వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన పూజలు చేస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని మల్లిపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన వారాహి అమ్మవారి నూతన ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి, మాధవి దంపతుల ఆధ్వర్యంలో గణపతి పూజ, మూల మంత్ర హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రాణప్రతిష్ఠ అనంతరం అమ్మవారికి తొలిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడిమెట్ల సత్యనారాయణరెడ్డి, సుజాత, తాడి కామిరెడ్డిలక్ష్మికవిత, గుడిమెట్ల వెంకటరెడ్డి, నాగమణి, సత్తి ధర్మాఏసురెడ్డి, పార్వతి దంపతుల ఆధ్వర్యంలో కలశ ఉద్వాసన, శిఖర స్నానం, అమృతస్నానం, అలంకరణ, కలశ శోధన, కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళనకరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వరరావు, బొర్రా గోపిమూర్తి

యలమంచిలి: చదువుల ఒత్తిడి వల్ల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తుందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు (ఐవీ) అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) యలమంచిలి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభ పాటవ పరీక్షల 28వ బహుమతి ప్రదానోత్సవ సభ ఆదివారం కట్టుపాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ సభలో మరో ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి కలసి ఐవీ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఏనుగువానిలంక హైస్కూల్ విద్యార్థి సూలా హరిరామ చరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఐవీ మాట్లాడుతూ శాసనమండలిలో విద్యార్థుల ఆత్మహత్యల పై ప్రత్యేకమైన చర్చ నిర్వహించామన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి ప్రణాళికతో చదువుకొని ఉన్నత విద్య అందుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి దిడ్ల వీర రాఘవులు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకెవి రామభద్రం, మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు, సర్పంచ్ పొన్నమండ నాగరాజు, యూటీఎఫ్ నాయకులు సరిపల్లి జయప్రభ, పోలిశెట్టి క్రాంతికుమార్, దండు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా బ్రాహ్మణచెరువు, నత్తారామేశ్వరం సెంటర్‌లు



బస్ షెల్టర్‌కు లేని నత్తారామేశ్వరం సెంటర్



వెలగలవారిపాలెం రోడ్డులో ఆక్రమణలు కారణంగా భారీలోడుతో వస్తున్న లారీ అదుపుతప్పిన దృశ్యం (ఫైల్)



బ్రాహ్మణచెరువు సెంటర్‌లో ప్రయాణికులకు ఉపయోగకరంగా లేని మార్టేరు రోడ్డు బస్ షెల్టర్

పెనుమంట్ర: మండలంలో ప్రధాన నాలుగు రోడ్ల కూడలిగా ఉన్న బ్రాహ్మణచెరువు , నత్తారామేశ్వరం గ్రామాల వద్ద ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపర్చి సెంటర్‌లలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. బ్రాహ్మణచెరువు సెంటర్‌లో మార్టేరు, అత్తిలి రోడ్డులలో బస్‌షెల్టర్‌లు ఉన్నప్పటికీ అక్కడ పారిశుద్ధ్యం లోపించడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. బ్రాహ్మణచెరువులోని భీమవరం రోడ్డుతో పాటు నత్తారామేశ్వరం సెంటర్‌లో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ రెండు సెంటర్‌లలోను మరుగుదొడ్లు సౌకర్యం లేకపోవడంతో మహిళా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ఆక్రమణలతో ఇబ్బందులు

బ్రాహ్మణచెరువు సెంటర్‌లో వెలగలవారిపాలెం వైపు రోడ్డు ఆక్రమణకు గురై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. వినాయకుడు గుడి వద్ద ఆటోలు అడ్డంగా నిలిపి ప్రయాణికులను ఎక్కించుకునే సమయంలో అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలు జరిగి ఇద్దరు మహిళలు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు జరిగాయి. బ్రాహ్మణచెరువు సెంటర్‌లో సర్కిల్ ఏర్పాటు చేసి వెలగలవారిపాలెం రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణికుల వాహనాలను రోడ్డుకు ఎదురుగా నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదే విధంగా బ్రాహ్మణచెరువు, నత్తారామేశ్వరం సెంటర్‌లలో మరుగుదొడ్లు నిర్మించి, మహిళలు, వృద్ధుల వెతలు తీర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.